మంత్రులెవ్వరూ విరుచుకుపడలేదు: సీఎం

కులగణన నివేదికపై ప్రత్యేకంగా ఏర్పాటైన మంత్రివర్గ సమావేశంలో మంత్రులెవ్వరూ ఏకపక్షంగా మాట్లాడలేదని, విరుచుకుపడలేదని సీఎం సిద్ధరామయ్య అన్నారు. శుక్రవారం నగరంలో మీడియాతో మాట్లాడిన ఆయన కులగణన నివేదికపై చర్చించాలని సమావేశమయ్యామన్నారు. అసంపూర్తిగా ముగిసిందని, మరోసారి కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఎవరూ వ్యతిరేకించలేదన్నారు. కొన్ని పత్రికలు, చానెళ్లలో అటువంటి కథనాలు వచ్చాయన్నారు. అయితే మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున కేబినెట్ భేటీ తర్వాత విధానసౌధలోనే కులగణనను అంగీకరించేది లేదని పేర్కొన్నారు.



సహచరులు.. ససేమిరా..?

- సీఎంకు షాక్ ఇచ్చిన కులగణన
- కేబినెట్‌లో కుదరని ఏకాభిప్రాయం
- కులానికే ప్రాధాన్యమిస్తున్న మంత్రులు
- వీరశైవలింగాయత తరహాలో సెల్ఫ్‌గోల్..!

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దేశంలోనే కాంగ్రెస్ పార్టీకి శక్తివంతమైన ముఖ్యమంత్రిగా పేరొందిన సిద్ధరామయ్యకు సొంత కేబినెట్ సహచరులు షాక్ ఇచ్చారు. కులగణన నివేదికను వారం క్రిందట కేబినెట్ స్వీకరించిన సంగతి తెలిసిందే. కులగణనపై సమగ్రంగా చర్చించి తీర్మానించాలని భావించి శుక్రవారం ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. వారంరోజుల ప్రక్రియలో ఎస్సీ, బీసీ సామాజికవర్గాలు కులగణనకు సానుకూలంగానే మాట్లాడాయి. సంబంధిత కుల సంఘాలు, మఠాధిపతులు, కులగురువులు, ఆచితూచి వ్యవహరించేలా మౌనంగానే ఉన్నారు. కానీ వీరశైవలింగాయత, ఒక్కలిగ నాయకులు మాత్రం కులగణనపై విరుచుకుపడుతూనే ఉన్నారు. రాష్ట్ర ఒక్కలిగసంఘం కులగణనపై అత్యవసర సమావేశం జరిపి మరింత ముందుకెళ్తే కర్ణాటక బంద్ చేపడతామని, ఎంతటికైనా వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఇక అఖిలభారత వీరశైవ మహాసభ, లింగాయత సంఘాలు, సంబంధిత సామాజికవర్గాలకు అనుబంధమైన వందలాదిమంది స్వామీజీలు తీవ్ర అభ్యంతరం లేవనెత్తారు. బ్రాహ్మణసంఘం కూడా కులగణనను వ్యతిరేకించింది. ఇలా అగ్రకులాలకు చెందిన సంఘాలు, స్వామీజీల వ్యతిరేకత ప్రభావం తీవ్ర పరిణామాలకు కారణమైంది. సామాజికవర్గాల మం త్రులు అడుగు ముందుకేసే పరిస్థితి లేకుండా పోయింది.

2న ఆమోదం పొందేనా..?

బీసీ కమిషన్ కులగణన నివేదికను స్వీకరించిన మంత్రివర్గం వారం రోజులపాటు అవగాహన పొందేందుకు గడువు ఇచ్చారు. అప్పటికే ఈ అంశంపై కులసంఘాలలో వ్యతిరేకత వచ్చింది. ఆమోదంకోసం ప్రత్యేకంగా జరిపిన కేబినెట్ భేటీ రసాభస అయ్యింది. ఆ తర్వాత రెండు వారాలు గడువు ఇస్తూ మే 2వ తేదీన మరోసారి కేబినెట్ భేటీకి ఆహ్వానించారు. అప్పుడు కూడా మంత్రులందరూ సమన్వయంగా వ్యవహరిస్తారనేది సాధ్యంకాని పరిస్థితిగా ఉంది. దీన్నిబట్టి కులగణన నివేదికకు ఇప్పట్లో ఆమోదం లభించడం అంత సులువు కాదనిపిస్తోంది. పైగా మరోసారి సర్వే జరపాలని, గతంలో సర్వేలో తప్పినవారి వివరాలు సేకరించాలని, ఏ అంశాలపై తప్పులు ఉన్నాయో వాటిని సర్దుబాటు చేయాలని మంత్రులు ప్రతిపాదించారు. ఈ అంశాలు ఏవీ అంత సులువుగా ముగించడం సాధ్యం కాదనే అభిప్రాయాలు ఉన్నాయి. దీన్నిబట్టి కులగణన నివేదికకు ఆమోదం అంతసులువు కాదనే అభిప్రాయాలు ఉన్నాయి.

వీరశైవ విభజన తరహాలో సెల్ఫ్‌గోల్..!

సీఎం సిద్దరామయ్య తొలిసారి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన 2013-18 కాలంలో వీరశైవలింగాయత సామాజికవర్గాలను విభజించాలనే అంశం ప్రతిపాదనకు వచ్చింది. కొందరు విభజన అమలు చేయాలని ప్రభుత్వానికి వినతిని ఇచ్చారు. దాని ఆధారంగా వీరశైవ లింగాయతలను వేర్వేరు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అందుకు కేబినెట్‌లో కీలమంత్రిగా వ్యవహరించిన ఎంబీ పాటిల్ ముఖ్యమంత్రికి మద్దతు ఇచ్చారు. అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన పార్టీ సీనియర్ నేత, అఖిలభారత వీరశైవమహాసభ జాతీయ అధ్యక్షుడు శ్యామనూరు శివశంకరప్ప దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. కేబినెట్‌లోనే తన అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు ఈ ప్రభావం కాంగ్రెస్‌పై పడి 2018 శాసనసభ ఎన్నికల్లో ఓటమికి కారణంగా మారిందని బహిరంగంగానే విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి సిద్దరామయ్య సెల్ఫ్‌గోల్ అంటూ అప్పట్లో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కులగణనలోనూ మరోసారి అటువంటి ఎదురుదెబ్బ తగిలింది.

సొంత కులానికే మంత్రుల ప్రాధాన్యం

మంత్రివర్గమంటే అంశం ఏదైనా ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తే సహచర మంత్రులంతా అంగీకరించాల్సి ఉంటుంది. కేబినెట్‌కు నేత కావడంతో ఆయన నిర్ణయానికి, మార్గదర్శకాలకు అందరూ ప్రాధాన్యత ఇవ్వడం సంప్రదాయం. కానీ సీఎం ప్రతిపాదనలుగానీ, కనీసం చర్చిద్దామని, మీ అభిప్రాయాలు తెలపాలని వారం రోజులుగా నివేదికపై ఏ విధమైన అవగాహన పొందారో వివరించాలని కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. వారి వ్యక్తిగత కులాలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత కేబినెట్‌లో మంత్రులు మూడు విభాగాలుగా ఉన్నారనేది ప్రచారంలో ఉంది. అందులో సీఎం సిద్దరామయ్య వర్గం, డీసీఎం డీకే శివకుమార్ వర్గం, అధిష్ఠానవర్గంగా ముద్ర ఉంది. కేబినెట్ భేటీ ద్వారా కేవలం కులాలకు అనుబంధంగానే మంత్రులంతా ఒక్కటవుతారనేది రుజువైంది.


శ్యామనూరు శివశంకరప్ప

డీసీఎం డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం



సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ భేటీ ప్రారంభం కాగానే మిగిలినమంత్రులందరూ ఎలా ఉన్నా డీసీఎం డీకే శివకుమార్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. కేటగిరీ 2ఏలో ఉండే 43లక్షల మందిని కేటగిరీ 1(బీ)లోకి మార్చి రిజర్వేషన్ పెంచాలనే వర్గీకరణ అంశంపై అభ్యంతరం తెలిపారు. ఈ అంశాన్ని తాము ఊహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా సీఎం జోక్యం చేసుకుని ఆవేశం, ఆగ్రహం వద్దని సలహా ఇచ్చినా డీసీఎం పట్టించుకునే పరిస్థితి లేకుండా తీవ్రంగా మాట్లాడారు. కులగణన అంశం తెరపైకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పలు కులాలకు చెందినవారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పలు సందర్భాల్లో ఆవేశం వద్దని సూచిస్తున్నా డీసీఎం వైఖరిలో మార్పు రాలేదు. అంతలోనే వీరశైవ సామాజికవర్గానికి చెందిన ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున జోక్యం చేసుకున్నారు. సర్వే, గణాంకాలు రెండూ సమంజసంగా లేవన్నారు. అందరినీ ఎత్తి ఎక్కడో ఒకచోట పడేయాలనే రీతిలో కులగణన ఉందన్నారు. ఇదే సమయంలోనే కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ సర్వే సమంజసంగా జరగలేదని, పలు ఇళ్లకు సర్వే చేసేందుకు వెళ్లలేదనే వాదనలు ఉంటే అందుకు పరిష్కారం ఉందని, సర్వేలో పాల్గొన్నవారి వివరాలు సేకరించవచ్చన్నారు. మంత్రి లాడ్ ప్రతిపాదనపై కొత్తగా సర్వే చేసేందుకు మీరెవరంటూ ప్రశ్నించారు. మంత్రులమధ్య వాగ్వాదం తారస్థాయికి చేరింది. వాస్తవానికి కేబినెట్ 4 గంటలకు ప్రారంభం కాగా రాత్రి పొద్దుపోయేదాకా చర్చించి అయినా ఆమోదిస్తారని భావించారు. కానీ మంత్రుల ఆగ్రహం, సీఎం సముదాయించినా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోవడంతో కేబినెట్‌ను అర్ధాంతరంగా వాయిదా వేశారు.

కులగణనను తేల్చేందుకు ఏడాది పట్టవచ్చు : మంత్రి

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికపై తీర్మానానికి మరో ఏడాది పట్టవచ్చని, ఇది అత్యంత జటిలమైన సమస్య అని సుదీర్ఘంగా చర్చలు జరగాలని రాష్ట్ర ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళి అభిప్రాయపడ్డారు. శుక్రవారం మంత్రి కేహెచ్ మునియప్ప ఇంటికి వెళ్లిన ఆయన కాసేపు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కులగణనపై తేల్చేందుకు మరో ఏడాది కావచ్చన్నారు. సర్వేలో ప్రజల అభిప్రాయమే తీసుకున్నారని, సంతకాలు పెట్టినవారే వ్యతిరేకిస్తున్నారన్నారు. సాదర కులస్థుల జనాభా కేవలం 64వేలు చూపించారని మూడు జిల్లాల్లో వారు అంతకంటే ఎక్కువగా ఉన్నారన్నారు. కులగణన నివేదిక సిఫారసు జారీచేయడం అంత సులువు కాదన్నారు. మంత్రి మునియప్ప మాట్లాడుతూ కులగణనపై ఇంకా ఎలాంటి తీర్మానం కాలేదన్నారు. లింగాయత, ఒక్కలిగలకు అన్యాయం జరగదన్నారు.


సీనియర్ మంత్రి మునియప్పతో మంత్రి సతీశ్ జార్కిహొళి

కాంతరాజ్ కమిషన్ నివేదిక

బీసీ వర్గాల కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన జయప్రకాశ్ హెగ్డే 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి 'సామాజిక, విద్య సర్వే 2015 అధ్యయన నివేదికను సమర్పించారు. 2015లో మాజీ జస్టిస్ హెచ్ కాంతరాజ్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2015లో కులగణన సర్వేకు సూచించారు. 51 నియమ నిబంధనల ప్రకారం 54 ప్రశ్నలతో కూడిన నమూనాను సిద్ధం చేశారు. 2015 ఏప్రిల్ 11 నుంచి 2015 మే 30వరకు సర్వే జరిగింది. రాష్ట్రంలో 1.35,35,772 ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించారు. 180 ఎస్సీ కులాలు, 105 ఎస్టీ కులాలతోపాటు 1351 కులాలతోపాటు గుర్తింపులేని 398 కులాలను సర్వే ద్వారా గుర్తించారు.

ఆయా కులాల జనాభా

ముఖ్యమైన కులాలు	ఉపకులాలు	జనాభా
వీరశైవ లింగాయత	94	66,35,233
ఒక్కలిగ	47	61,68,652
కురుబ	11	43,72,847
మరాఠా ఇతరులు	8	14,76,894
బెస్త	47	14,33,309
ఈడిగ	24	14,12,493
విశ్వకర్మ ఇతరులు	45	12,13,347
బలిజ ఇతర కులాలు	34	10,41,352
ముస్లింలు	99	76,99,425

కేటగిరీల వారీగా రిజర్వేషన్లకు సిఫారసు

కేటగిరీ	జనాభా	శాతం
కేటగిరీ 1ఏ	34,96,698	6
కేటగిరీ 1బీ	73,92,313	12
కేటగిరీ 2ఏ	77,78,209	10
కేటగిరీ 2బీ	75,25,880	8
కేటగిరీ 3ఏ	72,99,577	7
కేటగిరీ 3బీ	81,37,536	8
మొత్తం	4,16,30,153	51

- బీసీ కులాల జాబితాలో 1ఏ, 1బీ, 2ఏ, 2బీ, 3ఏ, 3బీల కేటగిరీలకు క్రీమీలేయర్ అనుసందానం జారీ చేయాలి.
- రాష్ట్రంలో ప్రస్తుతం బీసీ కులాలకు ప్రస్తుతం 32శాతం రిజర్వేషన్‌ను 51శాతానికి పెంచాలి.
- ఇంతకుముందు పలు కమిషన్‌లు రూపొందించిన నివేదికలను కాంతరాజ్ కమిషన్ అధ్యయనం చేసింది.


గోడను ఢీకొట్టి దెబ్బతిన్న వాహనం

ఘోర ప్రమాదం..!

- గొర్రెలకోసం వెళ్లిన నలుగురి మృతి
- మృతుల్లో ముగ్గురు శ్రీసత్యసాయి జిల్లావాసులు

6


వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలు



రైతు కష్టం నేలపాలు

- కోత దశలో నేలపాలైన పంటలు
- అన్నదాతను ముంచిన అకాలవర్షాలు, ఈదురుగాలులు

బళ్లారి, విజయనగరం ఉభయ జిల్లాల్లో అన్నదాతపై ప్రకృతి విరుచుకుపడింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లతో చేతికొచ్చిన పంటలు నేలరాలాయి. కోత దశకు వచ్చిన పంటలు రాలి పోవడంతో నిండా మునిగి పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తునానరు. అసలే గిట్టుబాటు ధరలు లేక విలవిలలాడుతుంటే అకాల వర్షాలు నిండా ముంచాయని వాపోతున్నారు. -6 లో..


కంప్లి వద్ద ధ్వంసమైన అరటి పంట

సీఈటీలో నకిలీ అభ్యర్థి

- యాప్ ద్వారా గుర్తించిన అధికారులు
- పారిపోయిన నిందితురాలు

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కామన్ ఎంట్రన్స్ పరీక్షలో నకిలీ అభ్యర్థిని అధికారులు గుర్తించారు. మల్లేశ్వరంలోని సిల్వర్‌వ్యాలీ పబ్లిక్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో గురువారం సంఘటన జరిగింది. వెంటనే కర్ణాటక పరీక్షా ప్రాధికార అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉదయం గణితం పరీక్ష రాసేందుకు ఫాతిమా జబీన్ అనే విద్యార్థిని శౌచాలయానికి వెళ్లి గంట సమయమైనా బయటకు రాలేదు. పరీక్షలు ప్రారంభమవుతున్నాయనగా క్యూఆర్ కోడ్ ద్వారా కేంద్రంలోకి ప్రవేశం చేందుకు ప్రయత్నించింది. ఆమె మొహాన్ని యాప్‌ద్వారా పరిశీలించిన అధికారులు నకిలీ అభ్యర్థిగా గుర్తించారు. ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చేలోగా పరారీ అయ్యింది. టబునాజ్ అనే అసలైన అభ్యర్థి హాల్‌టిక్కెట్‌కు ఫాతిమా ఫొటో అతికుంచుకుని వచ్చింది. వచ్చారు. అధికారులు గమనించేసరికే ఫాతిమా పరారీ అయ్యింది. కాగా గురువారం గణితం పరీక్షల్లో 91.95శాతం, బయాలజీలో 90.95 శాతం, బుధవారం జరిగిన ఫిజిక్స్‌లో 94.22శాతం, కెమిస్ట్రీలో 94.5శాతం మంది విద్యార్థులు హాజరయినట్లు అధికారులు తెలిపారు. అక్రమాలకు పాల్పడితే ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదని వారు హెచ్చరించారు.

బంగారు ఆభరణాలంటే ఎంతో ఇష్టం

- కొనేముందు జాగ్రత్తలు పాటించాలి
- రీగల్ జ్యువెలర్స్ ప్రారంభోత్సవంలో నటి రాధికా పండిట్

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలంటే తనకెంతో ఇష్టమని ప్రముఖ నటి రాధికా పండిట్ అన్నారు. శుక్రవారం మల్లేశ్వరంలో రీగల్ జ్యువెలర్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారం ధరలు పెరిగాయని, కొనేముందు జాగ్రత్తలు పాటించాలని వినియోగ దారులకు సూచించారు. రీగల్ జ్యువెలర్స్ హోల్‌సేల్ ధరలతోనే రిటైల్‌గా విక్రయిస్తోందని, వందశాతం 916 హాల్‌మార్క్ కల్గిన ఆభరణాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అంతర్జాతీయ సంస్థలు ధ్రువీకరించిన వజ్రాలను విక్రయిస్తోందన్నారు. ఎక్స్ఛేంజ్‌లో వందశాతం ఆఫర్లను కల్పిస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అశ్వత్థనారాయణతో పాటు రీగల్ జ్యువెలర్స్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న నటి రాధికాపండిట్


రాష్ట్రమంతటా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే పురస్కరించుని శుక్రవారం చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన చర్చిలు కిటకిటలాడాయి. పాస్టర్లు ఏసుక్రీస్తుకు సంబంధించి బైబిల్‌లోని ప్రధానఘట్టాలను చదివి వినిపించారు. ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, కోరమంగల, శివాజీనగర్, చామరాజపేట తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఉడుపి, దక్షిణకన్నడ, మైసూరు తదితర జిల్లాల్లోనూ సామూహిక ప్రార్థనలు కొనసాగాయి.


సెయింట్ జేవియర్ చర్చి వద్ద ప్రార్థనలు


సెయింట్ థెరెసా చర్చి వద్ద శిలువను మోస్తూ..




చర్చిలో అలంకరణ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.54	1,578.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	396	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	353	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.03	3.89



శిలువను మోస్తున్న క్రీస్తు వేషధారి

చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

విజయనగరం(హోస్పేట), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానవాళి పాపాల కోసం యేసు శిలువపై తన ప్రాణాన్ని అర్పించాడు అది తెలుసు కుని మన జీవితాలను మనం తీర్చిదిద్దుకోవాలి. ప్రపంచంలో మరణాన్ని అధిగమించి పునరుద్ధానం చేయబడిన ఏకైక వ్యక్తి యేసు అని వందని గురువు ఫాదర్ అన్నారు. సుందర్ రాజ్ తన ప్రసంగంలో ఇలా అన్నారు. గుడ్ ఫ్రైడే రోజు నగరంలోని క్యాథలిక్ చర్చిలో మండుతున్న మధ్యాహ్నం ఎండలో చర్చిలోని యువత భక్తితో యేసు బాధ, మరణం ఉపమానాన్ని ప్రదర్శించారు. యేసును కొరడాలతో కొట్టి, కొట్టిన దృశ్యం, మూడు బరువైన శిలువను మోసుకెళ్లిన దృశ్యం భక్తులకు కంటతడి పెట్టించింది. ప్రశాంత్ యేసుకు మరణశిక్ష విధించడానికి నిరాకరించిన రాజు పిలాతు పాత్రను పోషిస్తున్నాడు. జోయెల్ యేసు పాత్రను పోషిస్తున్నారు. తల్లి మేరీగా నికితా, వెరోనికా,ఒరేసిడ్ స్త్రీగా హరిణి యేసు శిలువను మోయడానికి సహాయం చేసిన వ్యక్తి సైమస్, ఈ పాత్రను పెబిస్ పోషించారు. క్లేటస్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

బాబా జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిం చాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు అనగాని, గొట్టిపాటి రవికుమార్‌ను శుక్రవారం ఆమె మడకశిరలో కలిశారు. ఈ సందర్భంగా బాబా జయంతి ఉత్సవాలకు ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరారు. పుట్టపర్తి అభివృద్ధి పనులకు రూ.885 కోట్లు అవసరమవుతాయని జిల్లా అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. నియోజకవర్గానికి ఐదు సబ్ స్టేషన్లను మంజూరుచేయాలని విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే కోరారు. అవసరమైనంతమేరకు నిధుల మంజూరుకు కృషిచేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అంబేడ్కర్ దళితుల పక్షపాతి

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళితుల పక్షపాతి అని, నిత్యం పేదల సంక్షేమం కోసమే పరితపించాడని సాహితీవేత్త, రచయిత పీర్ బాషా అన్నరు. హోస్పేట ప్రదుడు దేవరాయ సాంకేతిక కళాశాలలో శుక్రవారం అంబేడ్కర్ 134వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. భారతీయ సమాజ నిర్మాణం ప్రాచీన వేద సంస్కృతి స్థిరీకరణ వ్యవస్థ చట్రంలోనే రూపుదిద్దుకుందన్నారు. దేశ అభివృద్ధికి కులవ్యవస్థ ప్రాణాంతకమని, స్వాతంత్ర్యం ఒక్కటే సరిపోదు సమానత్వం అవసరమని అంబేడ్కర్ భావించారన్నారు. సామాజిక ఆర్థిక స్వేచ్ఛ అన్ని సామాన్య ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలను విద్యార్థులు అనుసరించాలన్నారు. వారి వ్యక్తిత్వాన్ని రూపొందించడానికి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలను తీసుకురావడంలో బ్రిటీష్ పార్లమెంట్ విజయం సాధించినప్పటికీ, భారతదేశంలోని కొన్ని రాజకీయ వ్యవస్థల కారణంగా అది అమలు కాలేదన్నారు.



పడిపోయిన వరి పైరు



కూలిన విద్యుత్ స్తంభం



అంగూరు వద్ద వరిపొలం..

రైతు కష్టం నేలపాలు



బళ్లారి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అన్నదాతపై ప్రకృతి విరుచుకుపడింది. వారం రోజులుగా ఉభయజిల్లాల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడ గండ్ల వానలకు పలు పంటలు నేలరాలాయి. కోత దశలో గింజలు నేల పాలు అయ్యాయి. శుక్రవారం బళ్లారి, విజయనగర జిల్లాలో బలమైన ఈదురు గాలులు వీచాయి. కోతదశలో ఉన్న వరిపంట నేలకొరిగింది. ఎకరాలో సరాసరి 5 నుంచి 6 బస్తాలు ధాన్యం నేలపాలు అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులగా ఈదురుగాలులు, వానలు రైతులను వణికిస్తున్నాయి. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో రైతులు అధికంగా వరి సాగు చేశారు. అయితే కోత దశలో ఉన్న వరి పంట నేలరాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బళ్లారి నగర శివారులోని హోస్పేట్ రోడ్డులో శుక్రవారం వీచిన బలమైన ఈదురు గాలులకు రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షాలు కూలిపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ధరలు లేక విలవిల

ఖరీఫ్‌లో పండించిన మిరప, పత్తి, జొన్న పంటలకు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిరప క్వింటాల్ రూ.7 వేలు పలుకుతోంది. గతంలో ఇదే మిరప క్వింటాల్ రూ.25 వేలదాకా పలికింది. ఇక పత్తి కూడా ధర పూర్తిగా పడిపోయింది. వరిధాన్యం కూడా ఆశించినంత ధర లేకపోవడంతో రైతులు అన్ని రకాల నష్టపోతున్నామని వాపోతున్నారు.

50 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట

బళ్లారి సిటీ: విజయనగరం జిల్లా హూవినహడగలి తాలూకాలోని అంగూరు, బ్యాలహున్సి గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన గాలి వాన కారణంగా 50 ఎకరాల వరి పంట దెబ్బతింది. రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం పొలాలను పరిశీలించి నష్టపరిహారాన్ని లెక్కించారు. కూడ్లిగి తాలూకాలోని ససల్వాడ గ్రామంలో వర్షం కారణంగా గోడ కూలి ఓ మహిళ గాయపడింది. ససల్వాడ, ఎచలబొమ్మనహళ్ళి, కుప్పినకెరె గ్రామాల్లో 9ఎకరాలకు పైగా తమలపాకుతోటలు, 10ఎకరాలకు పైగా బొప్పాయితోటలు గాలి వానకు దెబ్బతిన్నాయి.

నేలకొరిగిన అరటి, బొప్పాయి పంటలు

కంప్లి : సండూరు తాలుకా పరిధిలోని గొల్లలింగమ్మనహళ్లి గ్రామంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రైతు స్వామిరెడ్డికి చెందిన అరటిపంట పూర్తిగా ధ్వంసమైంది. సుమారు మూడు ఎకరాలలో అరటిసాగు చేశానని, కోత దశలో నేలరాలి తీవ్రంగా నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కూడ్లిగి తాలుకాలోని అయ్యనహళ్లి, నేలబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ, యర్రిస్వామి పొలాల్లో బొప్పాయి పంట పూర్తిగా నేలకొరిగింది. గ్రామంలో సుమారు రూ.కోటి పంట దెబ్బ తినిందని అంచనా వేస్తున్నారు.



అయ్యనహళ్లి గ్రామం వద్ద నేలకొరిగిన బొప్పాయి

రైతులకు న్యాయం చేయాలి

- జిందాల్ భూముల అమ్మకాలను రద్దు చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీకి తక్కువ ధరకు భూమిని ఇవ్వడంపై వివాదం హైకోర్టులో విచారణలో ఉండగానే ఆ భూమిని కంపెనీకి విక్రయించారని, దానిని రద్దు చేయాలని తమకు న్యాయం చేయాలని రైతులు జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక కార్యకర్త జంబయ్య మాట్లాడుతూ భూమిని కొనుగోలు చేయవద్దని జిల్లాయంత్రాంగాన్ని కోరామన్నారు. కేసు కోర్టులో ఉండగానే అమ్మడం సరికాదన్నారు. రైతుల జాబితాల్లో కనిపిస్తున్న జేఎస్‌డబ్ల్యూ పేరును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సండూర్ తాలూకలోని కురేకుప్ప, తోరణగల్, యరబనహళ్ళి, ముసేనాయకనహళ్ళి ప్రాంతాల్లో జిందాల్ కంపెనీకి మొత్తం 3.667 ఎకరాల భూమిని ఎకరానికి రూ.1.22లక్షల నుంచి 1.50లక్షల ధరకు విక్రయించాలని ప్రభుత్వం గత సంవత్సరం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ రైతులు గత ఏడాది డిసెంబర్ 19న హైకోర్టు ధార్వాడ్ బెంచ్‌ను ఆశ్రమించారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన హైకోర్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిందాల్ కంపెనీతో పాటు పలువురికి నోటీసులు జారీ చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది. ఇవన్నీ జరుగుతుండగా, ప్రభుత్వం ఈ సంవత్సరం మార్చి 6,7,14 తేదీల్లో జిందాల్‌కు భూమిని రిజిస్టర్ చేశారన్నారు. ఇపుడు అది టైటిల్ డీడ్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్‌గా జాబితా చూపిస్తోందని రైతులు ఫిర్యాదు చేశారు. రైతు సంఘం నాయకులు జంబయ్య, బి.వెంకటేశ్, హనుమంతప్ప, ఎర్రిస్వామి తదితరులు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.



రథోత్సవంలో పీఠాధిపతి నాగభూషణం శివాచార్యులు

వైభవంగా విరూపన్న తాత రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర కాలువ ఒడ్డున వెలసిన విరూపన్న తాత రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మంటపం వద్ద వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. రథోత్సవానికి హెబ్బశమఠ పీఠాధిపతి నాగభూషణం శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. భక్తులు విశేషంగా పాల్గొని పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో సంఘ సంస్థలు చేపట్టే సదుపాయాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ మంజుల అన్నారు. శుక్రవారం జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో ఏసీసీ అదాని ఆధ్వర్యంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలకు 180 చైర్స్, 36 టేబుల్స్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఏసీసీ అదాని సంస్థ సేవలు మరువలేవని అన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ రిజ్వాన్, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



టేబుళ్లు, కుర్చీలు అందజేస్తున్న ఏసీసీ అదానీ సంస్థ ప్రతినిధులు

ఘోర ప్రమాదం..!



ధనాపురం నాగభూషణ



శీగుపల్లి మురళి



కొటిపి నాగరాజు(ఫైల్)

హిందూపురం/రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు, రాష్ట్రానికి చెందిన ఒకరు మృతిచెందారు. రాయచూరు జిల్లా శాహపూర్ తాలూకాలో జరిగే సంతలో గొర్రెలు కొనేందుకు బొలెరొ వాహనంలో వెళుతుండగా శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగింది. వీరి వాహనం అదుపుతప్పి అమరపురం క్రాస్ వద్ద రోడ్డు పక్కన గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన నాగభూషణం(42), శీగుపల్లికి చెందిన మురళి(44), హిందూపురం మండలం కొటిపికి చెందిన నాగరాజు(40), కర్ణాటకలోని గౌరీబిదునూరు తాలూకా చిన్న బీరేపల్లికి చెందిన సోము(43) అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్ ఆనంద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ మార్గంలో వెళ్లేవారు గమనించి, సమాచారం ఇవ్వడంతో గబ్బూరు పోలీసులు అతన్ని రాయచూరులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాయచూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొటిపి నాగరాజు తరచూ తన బొలెరో వాహనంలో రాయచూరు ప్రాంతంలోని సంతకు వెళ్లి గొర్రెలను కొనుగోలుచేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య రూప, కుమారుడు ఉన్నారు. ధనాపురం నాగభూషణ పరిగిలో మటన్ షాపు నిర్వహిస్తుంటాడు. రాయచూరు ప్రాంతంలో గొర్రెలు తక్కువ ధరకు దొరుకుతాయని తెలుసుకుని మిగిలిన వారితో కలిసి బయలుదేరాడు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నాగభూషణకు భార్య సరోజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. శీగుపల్లి మురళి గొర్రెల వ్యాపారి. అక్కడి నుంచి కొనుగోలు చేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య ఉన్నారు. కర్ణాటక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. మృతదేహాలను తెచ్చుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వెళ్లారు. కాగా, డ్రైవింగ్ చేస్తున్న ఆనంద్ అర్ధరాత్రి 12 గంటల తరువాత డ్రైవింగ్ బాధ్యతలను మరొకరికి ఇచ్చాడని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాన్ని ఎవరు నడుపుతున్నారనే విషయమై స్పష్టత లేదని తెలిపారు.

సుడిగుండంలో చిక్కుకుని ఇద్దరు..



మృతదేహాలను వెలికి తీస్తున్న పోలీసులు

రాయచూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తుంగభద్ర నదీ తీర గ్రామం ఎలెబిచ్చాలి వద్ద శుక్రవారం ఇద్దరు భక్తులు మృత్యువాత పడ్డారు. ఈత కోసం నదిలోకి దిగిన భక్తులు కొద్ది దూరం లోతుకు వెళ్లగా అక్కడే సుడిగుండానికి చిక్కి మృత్యువాతపడినట్లు తోటి భక్తులు తెలిపారు. బెంగళూరులోని దేవనహళ్ళి వద్ద ఓ కాలేజీకి చెందిన ఉపన్యాసకులతో పాటు విద్యార్థులు మొత్తం 15 మంది బెంగళూరు నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చారు. అక్కడ దర్శనం అనంతరం జిల్లాలోని ప్రముఖ పంచముఖి గణదాళ హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు, రాఘవేంద్ర స్వామి తపోవనంగా ఖ్యాతిగాంచిన ఎలెబిచ్చాలి సమీపంలోని తుంగభద్ర నదీ తీర గ్రామాన్ని సందర్శించారు. అక్కడ స్నానాలు ఆచరిస్తున్న భక్తుల్లో ఇద్దరు దూరంగా వెళ్లి స్నానం చేసేందుకు వెళ్లగా అక్కడ సుడిగుండంలో చిక్కుకున్నారు. మృతులను ముత్తురాజు(24), మదన్(20)లుగా గుర్తించారు. మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించి, అనంతరం వారి తల్లిదండ్రులకు, బంధులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. యరగేరా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి



భీమన్న మృతదేహం

గుత్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున గుత్తి రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం యాదగిరికి చెందిన భీమన్న(45) కుటుంబ సమేతంగా బెంగళూరుకు నాదెండ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-7 బోగిలో ప్రయాణిస్తున్నాడు. గుంతకల్లు దాటిన తరువాత ఆయన ఉన్నట్టుండి స్పృహ తప్పిపడిపోయాడు. ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందజేశారు. రైలు గుత్తి రైల్వేస్టేషన్‌కు రాగానే పోలీసులు ఆ వ్యక్తిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెనొప్పితో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భీమన్న బెంగళూరులో బిల్డర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు రమేష్, కుమార్తె దీపక ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..

రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా హిరేకోట్నెకల్ గ్రామంలో మరమ్మత్తు పనుల కోసం విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృత్యువాతపడ్డాడు. శుక్రవారం హిరేకోట్నెకల్ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మరమ్మత్తు చేసేందుకు వచ్చిన జెస్కాం సిబ్బంది గ్రామానికి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషన్ మహ్మద్ రఫీ అనే వ్యక్తిని స్తంభం పైకెక్కించి మరమ్మత్తు చేపట్టాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా రావడంతో అతడి షాక్‌కు గురై మృత్యువాతపడ్డాడు. గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ(45) మృతుడిగా గుర్తించి బంధువులు, గ్రామస్థులు జెస్కాం కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. జనసేవా ఫౌండేషన్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నాకు దిగిన గ్రామస్థులు మృతుడి కుటుంబానికి రూ.25లక్షల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తు మాన్వి జెస్కాం ఈఈ చంద్రశేఖర్ దేసాయికి వినతి పత్రం ఇచ్చారు.

ఉపాధి కూలీలకు అవగాహన

తోరణగల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నరేగా పనులను పరిశీలిస్తూ అక్కడి పనిచేస్తున్న మహిళలకు ఉపాధి హక్కులను అధికారులు వివరించారు. శుక్రవారం సండూరు తాలుకా రాజాపుర గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను అధికారులు పరిశీలించారు. అక్కడి సౌకర్యాలపై కూలీలతో ఆరా తీశారు. రోజు కూలీ రూ.370 పెరిగిందిని వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ కార్యదర్శి అధికారులు మడిగిన బసప్ప, రేణుకా ఆచార్య పంచాయతీ అభివృద్ధి అధికారులు రామప్ప, కేశవ మూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి సౌకర్యాలు వివరిస్తున్న అధికారులు

హోసూరు జోన్

వార్డులో మేయర్ పర్యటన



స్థానికుల సమస్యలపై ఆరాతీస్తున్న మేయర్ సత్య

హోసూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని 17వ వార్డు పరిధిలో మేయర్ సత్య పరిశీలించారు. గాంధీనగర్, ఎంఎంనగర్, రాజాజినగర్‌లలోని ప్రాంతాలను పర్యటించి స్థానికుల సమస్యలను ఆలకించారు. రోడ్లు, తాగునీరు సమస్యలపై ఆరా తీశారు. వార్డులోని అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకరన్, కౌన్సిల్ సభ్యులు నాగరాజ్, వార్డు అసోసియేషన్ నిర్వాహకులు చంద్రన్, పాట్రిక్, మునిరాజ్, మైల్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

కారు, వ్యాన్ ఢీ - మహిళ మృతి

హోసూరు క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మారుతి కారు, వ్యాన్ ఢీ కన్న ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. కమచ్చిపట్టికి చెందిన గోపినాథ్ సింగరపేట్టై ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా ఉన్నారు. తల్లి, భార్య, పిల్లలతో కలసి ట్రిప్‌కు వెళ్లి గురువారం ఉదయం వాపసు వస్తున్నారు. మద్దూరు సమీపంలోని కన్నండహళ్ళిలో ఎదురుగా వస్తున్న ఐచర్‌వ్యాన్‌ను, మారుతికారు ఢీ కొంది. ప్రమాదంలో కారులో ఉన్న ఉమారాణి (60)తలకు బలమైన గాయాలు తగలడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రెండుగంటల తర్వాత కారు శిథిలాల కింద చిక్కుకున్న గోపినాథ్‌ను మాథుర్ పోలీసులు, స్థానికులు రక్షించారు. స్వల్పంగా గాయపడిన గోపినాథ్ భార్య జీవిత, పిల్లలు జయ, హరిశివలను కృష్ణగిరి మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా కృష్ణగిరి - తిండివనం జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. మాథుర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలత

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలత అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, పథకాల గురించి తెలుసుకోవడానికి జాతీయ, రాష్ట్ర న్యాయసేవాకేంద్రాలను సంప్రదించాలన్నారు. హోసూరులో శుక్రవారం మెగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెట్లను ఇష్టం వచ్చినట్టు తొలగించడం వల్ల గ్లోబల్ వార్మింగ్, వాయుకాలుష్యం పెరుగుతోందన్నారు. కార్బన్‌డై ఆక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తున్న మొక్కలు, చెట్లను నాటి, సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. అదే విధంగా చట్టపరమైన సమస్యలపై అవగాహన పెంచుకోవడానికి ప్రజలు జాతీయ, రాష్ట్ర న్యాయసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయ సలహా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ తంగదురై తదితరులు పాల్గొన్నారు.

పురసభ అధ్యక్ష పదవికి ప్రియాంక నాయక్ రాజీనామా




రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు పురసభ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రియాంక నాయక్ తమ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గురువారం రాత్రి జిల్లాధికారి కే నితీశ్‌కు అందజేశారు. గత ఏడాది అధ్యక్ష స్థానం కోసం ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రియాంక నాయక్ ఇటీవల విద్యుత్ శాఖలో జరిగిన పోటీ పరీక్షల్లో పాసై ఏఈ పోస్టుకు ఎన్నిక కావడంతో పదవిని వదులుకున్నారు. ప్రియాంక నాయక్ రాజీనామాను ఆమోదించిన జిల్లాధికారి కే నితీశ్,ఇంచార్జ్ అధ్యక్షురాలిగా ఇప్పటివరకు ఉపాధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న మంజుల ప్రియారాజ్‌కు అప్పగించారు. ప్రస్తుత సింధనూరు నగరసభ పదవి కాలం అక్టోబర్ వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చార్లెస్ డార్విన్ (వర్ధంతి)



జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త చార్లెస్ రాబర్ట్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లాండులో జన్మించారు. 'డార్విన్స్ థియరీ ఆఫ్ ఎవల్యూషన్' భూమిమీద జీవుల పరిణామక్రమాన్ని తెలియచేస్తుంది. ఆధునిక జీవశాస్త్రంలో డార్వినిజం ఎంతోమార్పు తెచ్చింది. మూఢనమ్మకాలను విభేదించడంలో కూడా కీలక పాత్ర పోషించింది. 'డార్వినిజం' ప్రపంచంలో ఎంతో మంది భౌతికశాస్త్రవేత్తలను, జీవశాస్త్రవేత్తలను ప్రభావితం చేసి ఆధునిక భౌతికశాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. వందలాది పురస్కారాలు అందుకున్నారు. 1882 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

మేడసాని మోహన్ (పుట్టినరోజు)



ప్రముఖ అవధానిగా రాణించిన డాక్టర్ మేడసాని మోహన్ 1955 ఏప్రిల్ 19న చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నడింపల్లెలో జన్మించారు. 15వ యేటకే తొలిసారి అష్టావధానం చేసి పండితులచే ప్రశంసలు అందుకున్నారు. టీటీడీ అనుబంధమైన అన్నమాచార్య ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. తెలుగు, సంస్కృత సాహిత్యంలో దిగ్గజం. 600కుపైగా అష్టావధానాలు చేశారు. సహస్రావధానం, పంచసహస్రావధానం కూడా చేశారు. అన్నమాచార్య కీర్తనలపై పరిశోధనచేసి మద్రాస్ యూనివర్శిటీచే పీహెచ్‌డీ అందుకున్నారు. అహోబిలం మఠం ఆస్థానపండితుడిగా వ్యవహరిస్తున్నారు.

ముఖేశ్ అంబానీ (పుట్టినరోజు)



ముఖేశ్ ధీరూబాయి అంబానీ 1957 ఏప్రిల్ 19న జన్మించారు. దేశంలో పేరొందిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ సంస్థకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. 2023 ఫిబ్రవరి నాటికి ప్రపంచ శ్రీమంతులలో 13వస్థానంలో నిలిచారు. వ్యాపారవేత్తగా పలు అవార్డులు అందుకున్నారు. 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు నాన్ అమెరికన్ కేటగిరీలో నియమితులైన డైరెక్టర్. కాగా ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఫ్రాంచైజీగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేలా ఇండియన్ సూపర్‌లీగ్‌ను ఏర్పాటు చేశారు.

మారియ షరపోవా (పుట్టినరోజు)



రష్యాకు చెందిన ఆమె టెన్నిస్ క్రీడాకారిణి మారియ షరపోవా 1987 ఏప్రిల్ 19న సోవియెట్ యూనియన్‌లో న్యాగన్‌లో జన్మించారు. 18ఏళ్లకే వరల్డ్ నెంబరు వన్‌గా నిలిచిన ఆమె 2001-2020 వరకు సింగిల్స్‌లో డబ్ల్యుటీఏచే ఐదు సార్లు నెంబరు వన్‌గా కొనసాగారు. కెరీర్ గ్రాండ్‌స్లామ్ తొలి రష్యన్ విజేత. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో రజత పతకం కైవశం చేసుకున్నారు. ఐదు గ్రాండ్‌స్లామ్, రెండు ఫ్రెంచ్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ మొత్తం 36 టైటిల్స్ సాధించారు. డబుల్స్‌లోనూ సత్తా చాటుకున్నారు. 2020లో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

లారీ యజమానుల సమ్మె విరమణ

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెంచిన టోల్‌గేట్ చార్జీలు, డీజిల్ ధర తగ్గించాలనే ప్రధాన డిమాండ్లతో లారీ యజమానుల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మె ఎట్టకేలకు విరమించుకున్నారు. ఈనెల 14న అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో కొనసాగుతున్న విషయం విదితమే. లారీ యజమానుల సంఘం తొలి విడతలో సీఎంతో జరిపిన ఫలించలేదు. అయితే రెండో విడత రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితో గురువారం చర్చలు జరిపారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు సమ్మెను విరమిస్తున్నట్టు లారీ యజమానులు, ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు షణ్ముగప్ప శుక్రవారం మీడియాకు ప్రకటించారు. మంత్రితో జరిపిన చర్చలు సానుకూలంగా ఉండడంతో విరమించినట్టు తెలిపారు.

కంప్లి: రాష్ట్రంలో లారీ యజమానుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని, మంత్రి హామీ మేరకు సమ్మెల విరమిస్తున్నట్లు లారీ యజమానుల సంఘం రాష్ట్ర నాయకులు షణ్ముఖ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. నాయకులు మహేష్ మాట్లాడుతూ పెంచిన డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. సమ్మెకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

రీల్ చేస్తూ కింద పడ్డానని చెప్పడం అబద్ధం

హైదరాబాద్ పోలీసుల ప్రకటనను ఖండించిన బాధితురాలు

ఉరవకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నుంచి తనను తాను కాపాడుకునేందుకు రైలు నుంచి దూకితే, రీల్స్ చేస్తూ కింద పడ్డానని పోలీసులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఉరవకొండకు చెందిన యువతి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగేంతవరకూ పోరాడతానని అన్నారు. ఉరవకొండలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో తాను ఉద్యోగం చేస్తున్నానని ఆమె తెలిపారు. మార్చి 22న తన సెల్‌ఫోన్ రిపేరీ చేయించుకునేందుకు సికింద్రాబాదుకు వచ్చి, తిరిగి రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కి మేడ్చల్‌కు బయలుదేరానని తెలిపారు. తాను ఎక్కిన బోగీలో ఎవరూ లేకపోవడంతో అందులో ఉన్న యువకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. దీంతో తాను భయపడి కదిలే రైలు నుంచి కిందకు దూకేశానని తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదని, హైదరాబాదు యశోద ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు చికిత్స పొందానని తెలిపారు. పోలీసులు మార్చి 25న ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారని, యువకుడు దాడి చేసినందుకు తాను దూకలేదని, రీల్స్ చేస్తూ జారిపడ్డానని పోలీసులు చెప్పారని అన్నారు. పోలీసులు అబద్ధాలు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

ధర తగ్గిన కీరదోస.. రైతుల్లో ఆందోళన

ముళబాగిలు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కీరదోస ధర రోజురోజుకు తగ్గుముఖం పట్టడంతో రైతులలో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం కిలో కీరదోస కేవలం రూ.3 పలుకుతోంది. వేసవిలో సాధారణంగా అన్ని రకాల కూరగాయలతోపాటు కీరదోస వాడుతున్నారు. కోలారుజిల్లాలో 10వేల ఎకరాలలో కీరదోస పండిస్తున్నారు. గిట్టుబాటు లేక రైతుల్లో నిరాశే మిగిలింది.

ఎకరాకు రూ.లక్ష ఖర్చు

ఒక ఎకరా కీరదోస సాగు చేసేందుకు కనీసం రూ.లక్ష దాకా ఖర్చు అవుతుందని రైతు రంగనాథ్ అభిప్రాయపడ్డారు. పంట దిగుబడి రావడానికి 45రోజుల సమయం పడుతుంది. కాగా 15సార్లు పంటను కోసే అవకాశం ఉంది. మంచి దిగుబడి, ధర లభిస్తే రూ.3లక్షలదాకా ఆదాయం ఉంటుందన్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పెళ్ళిళ్ల, దేవుడి రథోత్సవాలు, పండుగల కారణంగా కీరదోసకు డిమాండ్ ఉంటుందనే విశ్వాసంతో పెద్ద సంఖ్యలో రైతులు సాగు చేశారు. స్థానికంగా పండించే కీరదోసను సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అయితే ఈసారి అక్కడ కూడా కీరదోస సాగు చేయడంతో డిమాండ్ తగ్గింది. జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉండడం, భూగర్భజలాలు అడుగంటినా ఉన్న నీటితోనే సాగు చేశారు. నెలరోజులుగా పలు కూరగాయల ధరల



ధర లేకపోవడంతో పొలంలోనే కీరదోస ఇలా...

తగ్గుముఖం పట్టడం తో రైతులలో ఆందోళన నెలకొంది. గత ఏడాది రూ.2లక్షలతో రెండు ఎకరాల్లో కీరదోసను పండించగా వేసవి ఎండలకు సరైన దిగుబడి లేక నష్టపోయానన్నారు. రూ.3.5లక్షలతో 4 ఎకరాల్లో పంట పండించగా మంచి దిగుబడి వచ్చిందని ధర లేక నష్టపోయానన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాబృందాలతో ప్రణవానందపురి స్వామిజీ తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె గ్రామంలో ధర్మరాయస్వామి ద్రౌపదమ్మదేవి ఆలయ 73వ వార్షిక పూలకరగ ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, ప్రజలను అలరించాయి. ఈ సందర్భంగా కళాకారులకు శివనాపుర వహ్నికుల శక్తిపీఠం ఆదిశక్తి మహాసంస్థానాధిపతి ప్రణవానందపుర స్వామిజీ జ్ఞాపికలు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఎవరి బతుకు శాశ్వతం కాదని ఉన్నంతకాలంలో సమాజానికి మంచి చేయాలన్నారు. గురువుల మార్గదర్శకంతో ఉన్నత లక్ష్యాలు అందుకుని ముందుకు సాగాలని యువతకు సూచించారు. ప్రస్తుతం మనం ఒత్తిడితో కూడిన జీవనం సాగిస్తున్నామని, మానసిక ప్రశాంతతను పట్టించుకోవడం లేదన్నారు. ద్వేష అసూయ భావాలు అధికమయ్యాయని ఈధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. ధార్మిక కార్యక్రమాల్లో తరచూ పాల్గొని, కష్టంలో ఉన్నవారికి చేతనైన సాయం చేయాలన్నారు. అప్పుడే సమాజంలో సుఖశాంతులు, సామరస్యం సాధ్యమన్నారు. స్థానిక విద్యార్థుల భరతనాట్యం, ఏకపాత్రాభినయం, నాటక ప్రదర్శన, జానపద కళల ప్రదర్శన తదితర కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ, ధర్మరాయస్వామి సేవా అభివృద్ధి ట్రస్టు గోపాలప్ప, జయరాం, మురళి, ఆంజినప్ప, చంద్రు, పునీత్, వేణు, రైతు ప్రముఖులు కృష్ణప్ప, గోపాలకృష్ణ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో ఎవరికీ అన్యాయం కాదు: మాజీ ఎమ్మెల్యే



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సంపంగి

బాగేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదిక వల్ల ఏ వర్గానికి అన్యాయం జరగదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలో కేబినెట్‌లో చర్చల అనంతరం తుది తీర్మానం తీసుకుంటారని కేపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ సంపంగి విశ్వాసం వ్యక్తం చేశారు. తాలూకాలోని యల్లంపల్లి గ్రామంలో లక్ష్మీ వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవానికి విచ్చే సిన వేళ స్వామివారికి విశేషపూజల అనంతరం కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ధార్మిక కైంకర్యాలు జరిగాయి. సమావేశంలో సంపంగి మాట్లాడుతూ కులగణన, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ గురించి రాష్ట్రవ్యాప్తంగా అనుకూల, వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని దీనిపై సీఎం, డీసీఎంలో ఇప్పటికే చర్చలు జరిపారన్నారు. అన్ని అంశా లను సమగ్రంగా పరిశీలించాకే తగిన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. బాగేపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యానని, పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణ చేపట్టానన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సరస్వతమ్మ అశ్వత్థప్ప, సభ్యులు శశికళ నారాయణస్వామి, ఆది నారాయణప్ప, భాగ్యలక్ష్మి కృష్ణప్ప, వెంకటేశ్ రెడ్డి, లక్ష్మీ శివప్ప తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఐపీఎల్ సందడి

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి వర్షం కురవడంతో మ్యాచ్ కొంత ఆలస్యమైంది. అయితే సాయంత్రం నుంచే అభిమానులు పెద్దసంఖ్యలో స్టేడియంకు చేరుకున్నారు. ప్రత్యేకించి ఆర్‌సీబీ తరపున విరాట్‌కోహ్లి గెటప్‌లో ఒక అభిమాని స్టేడియం బయట బ్యాటింగ్ చేస్తూ ఆకట్టుకున్నాడు. పలువురు అభిమానులు ఆర్‌సీబీకి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు.



స్టేడియం బయట సందడి



స్టేడియంలో పిచ్ తడవకుండా ఏర్పాట్లు

23న హాస్టల్ కార్మికుల రాష్ట్రస్థాయి ఆందోళన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో హాస్టల్ కార్మికుల రాష్ట్రస్థాయి నిరసన చేపట్టనున్నట్లు కర్ణాటక యునైటెడ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లాధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ తెలిపారు. హాస్టల్ కార్మికుల రాష్ట్రస్థాయి నిరసన నేపథ్యంలో రాష్ట్రస్థాయి నిరసనకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం ఏఐయూటీయూసీ కార్యాలయంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, షెడ్యూల్డ్ తరగతుల సంక్షేమ శాఖ, మైనార్టీల సంక్షేమ శాఖ, కర్ణాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ అసోసియేషన్ (సీఆర్ఐఎస్) సభ్యులు ఇందులో పాల్గొంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో హెడ్ కుక్, కుక్స్, కిచెన్ అసిస్టెంట్లు, నైట్ వాచ్‌మెన్, క్లీనర్లు, జవాన్లు వంటి 'డీ' గ్రూప్ ఔట్‌సోర్స్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఐయూటీయూసీ కి అనుబంధంగా ఉన్న కర్ణాటక స్టేట్ యూనైటెడ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపడ్తామన్నారు. పాఠశాలలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్స్ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. కనీసవేతనం రూ.35,950 చేయాలన్నారు. అన్ని హాస్టళ్లలో వార్డెన్లను నియమించాలని, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న హాస్టల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్

ఘనంగా విజయనగర సామ్రాజ్య స్థాపన దినోత్సవం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని అఖండ కర్ణాటక వాల్మీకి నాయక రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విజయనగర సామ్రాజ్య స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాశి తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్ నాయక్ జిల్లా అధ్యక్షుడు ముద్ద మల్లయ్య నేతృత్వంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మాపూర్ మాట్లాడుతూ కర్ణాటక చరిత్రలో ఎందరో వాల్మీకి నాయకులు జాతి నిర్మాణం కోసం ప్రాణాలర్పించారన్నారు. అనేగుంది, చిత్రదుర్గ, రాయచూర్, బళ్లారి, విజయనగరం తదితర ప్రాంతాల్లో అక్కబుక్క సామ్రాజ్యం పాలేగార్ రాజ్యంలో వాల్మీకులు విశేష ఖ్యాతి సంపాదించారన్నారు. అనంతరం ప్రొఫెసర్ వీరభద్రప్పతో పాటు మరో ఇద్దరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ప్రముఖులు సత్యనారాయణ కార్పొరేటర్ హనుమంతప్ప, రుద్రప్ప, మెడికల్ షాపు మల్లికార్జున, దేవినగర్ భీమయ్య, జాలిహాల్కావి సిద్దరూపనగుడి గోవిందప్ప, గంగాధర, ఎస్పీ సర్కిల్ మల్లికార్జున, షణ్ముఖ, సింధిగేరి గోవిందప్ప, రూపనగుడి వెంకటేష్, దుర్గన్న శ్రీనాథ్, జ్యోతి లక్ష్మీ, చంద్రశేఖర్, బుగ్గయ్య, రాజా వాల్మీకుల బంధువులు తదితరులు పాల్గొన్నారు



రాష్ట్ర నాయకులను సత్కరిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

ఘనంగా రథోత్సవం

ఉరవకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రంలో శుక్రవారం జనార్దన వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అలాగే పల్లకీసేవ, రథ హోమం, రథప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి మడుగు తేరు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అశేష భక్తజనం నడుమ రథాన్ని లాగారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డీసీఎంతో అనిల్ కుంబ్లే భేటీ



డీసీఎం డీకే శివకుమార్‌తో అనిల్‌కుంబ్లే చర్చలు

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రముఖ క్రికెటర్ అనిల్‌కుంబ్లే భేటీ అయ్యారు. సదాశివనగర్‌లోని నివాసంలో శుక్రవారం కలిశారు. సుమారు అరగంటకుపైగా చర్చలు జరిపారు. అనిల్‌కుంబ్లే డీసీఎంను కలవడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. సాధారణంగా క్రికెట్ కార్యక్రమాలు మినహా ఎక్కడా అనిల్ కుంబ్లే పాల్గొనేవారు కాదు. అటువంటిది డీసీఎంను కలవడం పలు విధాలా చర్చకు కారణమవుతోంది. కాగా బీజేపీ సీనియర్ నేత మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి డీసీఎంను కలిశారు. వారిద్దరిమధ్య ఎలాంటి చర్చలు జరిగాయనేది కుతూహలంగా మారింది. ప్రధానంగా లింగాయత సామాజికవర్గంవర్గంలోని పంచమశాలి విభాగానికి నిరాణి కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలతోపాటు పారిశ్రామికవేత్తగా నిరాణి సుపరిచితులు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమావేశం శనివారం మధ్యాహ్నం 3 నుంచి 5వరకు ఉంటుందని బెస్కాం గ్రామీణ, పట్టణ ఉపవిభాగం సహాయక కార్యనిర్వాహకుడు ఇంజనీర్ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సురక్షత తదితర అంశాలపై సమావేశం ఉంటుందన్నారు. తాలూకాలోని గ్రామపంచాయతీ పంచాయతీ అధ్యక్షులు, పదాధికారులు, నగరసభ అధ్యక్షులు పాల్గొని స్థానిక సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

హుబ్బళ్ళి ఎన్‌కౌంటర్... పోలీసులకు సంక్లిష్టం



రితేశ్‌కుమార్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి నగరంలో ఐదేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడు రితేశ్‌కుమార్ (35)ను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులకు సంక్లిష్ట పరిస్థితి నెలకొంది. ఎన్‌కౌంటర్‌కు గురైన రితేశ్ ఎవరనేది అంతుచిక్కడం లేదు. అతడు హిందీ మాట్లాడేవారిగా మాత్రమే గుర్తించారు. అతడి మిత్రులు, కుటుంబ సభ్యులు ఎవరనేది ఇంకా తేలలేదు. హుబ్బళ్ళి-ధారవాడ నుంచి ఓ బృందం బిహార్‌కు వెళ్లింది. అక్కడ వాట్లతోపాటు పలు ప్రాం తాల పోలీస్‌స్టేషన్‌లలో ఇతడి ఆచూకీకోసం గాలిస్తోంది. ఇప్పటివరకు ఎటువంటి వివరాలు తెలియరాలేదు. దీంతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, హరియాణాతోపాటు హిందీ మాట్లాడే రాష్ట్రాలు పలు బృందాలను పంపారు. అక్కడి పోలీస్ కమిషనర్, ఎస్పీలతో చర్చలు జరిపి నిందితుడి వివరాలు, కుటుంబీకుల గురించి ఆరా తీయదలిచారు. రాష్ట్రంలోని 30 జిల్లాలకు సిబ్బందిని పంపారు. రైల్వేస్టేషన్, పోలీస్‌స్టేషన్, బస్టాండ్‌లలో రితేశ్ ఫోటో చూపి ఆరా తీస్తున్నారు. హుబ్బళ్ళి అశోకనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభించిన సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా అతడి ఫోటోలను సేకరించారు. ఇతరత్రా ఆధారాలు లభించలేదు. మరోవైపు ఎన్‌కౌంటర్ ఎలా చేశారనే కోణంలో కూడా పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేసి...

బీజేపీ కార్యకర్త ఆత్మహత్య



ప్రవీణ్‌గౌడ (ఫైల్)

దొమ్మసంద్ర, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు ప్రాంతం ఆనేకల్ పట్టణంలో బీజేపీ కార్యకర్త ప్రవీణ్‌గౌడ ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగళూరు నాగవార బీజేపీ కార్యాలయంలో కార్యకర్త వినయ్ సోమయ్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మరువకముందే ఆనేకల్‌లో జరిగింది. ఆనేకల్ ఎస్‌వీఎం స్కూల్ వద్ద ప్రవీణ్‌గౌడ బేలూరు (35) ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఫేస్‌బుక్‌లో పలువురి పేర్లను ప్రస్తావించారు. బీజేపీ హోబళి అధ్యక్షుడు మునిరాజ్‌గౌడ, కౌన్సిలర్ భాగ్యమ్మ, శ్రీనివాస్‌లపై ఆరోపణలు చేశారు. కిరణ్ అనే వ్యక్తిపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. వీడియోలో సమందూరు కిరణ్, గోకుల్ ఫ్యాషన్ హరీశ్, భాస్కర్, నారాయణప్ప, దొడ్డహాగడె మధుగౌడ, శరవణలు ఆత్మహత్యకు కారణమని పేర్కొన్నారు. కిరణ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదని, అతను అమ్మాయిలకు ఫోన్ చేసి వేధిస్తున్నాడని, అతడి చర్యలన్నీ నాపై వచ్చాయన్నారు. డబ్బుల విషయమై చర్చిద్దామని పిలిపించి దాడి చేశారని ఆరోపించారు. బీజేపీ హోబళి అధ్యక్షుడు మునిరాజ్‌గౌడ ఇంటికి పిలిస్తే వెళ్లానని, అక్కడ కౌన్సిలర్ భాగ్యమ్మ, భర్త శ్రీనివాసులతోపాటు మరో పదిమంది రెండు గంటలపాటు దాడి చేశారని ఆరోపించారు. గురువారం రాత్రి ప్రవీణ్ ఆత్మహత్య చేసుకోగా ఆనేకల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హిందువులపై దాడులను ఖండించాలి: బీజేపీ

యాడికి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా సెక్రటరీ మురళీకృష్ణ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బెంగాల్‌రాష్ట్రంలో చాలాకాలం నుంచి హిందువులపై తరచుగా దాడులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌తోపాటు కొన్ని ప్రాంతీయ పార్టీలు పాలించే రా ష్ట్రాల్లో హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. బెంగాల్‌రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని తెలిపారు. అక్కడ రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరారు.